క్లుప్తంగా

ముగిసిన శ్రీమద్భాగవత ప్రవచనాలు



హోమం నిర్వహిస్తున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో భూదేవిశ్రీదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి

ఆదోని అర్బన్ : పట్టణంలోని ఆర్ట్స్ కళాశాల వెనక వెలిసిన శ్రీ హథీ రామ్‌బావాజీ మఠంలో వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని శ్రీమద్భాగవత ప్రవచనాలు ఏర్పాటు చేశారు. వైకుంఠ ఏకాదశి రోజు నుంచి వారం రోజులపాటు జరిగిన ఈ ప్రవచనాలు ఆదివారంతో ముగిశాయి. ఉదయం భూదేవి, శ్రీదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి వారికి పంచామృతాభిషేకం, ప్రత్యేక తులసీ పూల అలంకరణ, నైవేద్యం, మహా మంగళహారతి కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా భక్తులతో హోమం నిర్వహించారు. అనంతరం భాగవతంలోని శ్రీకృష్ణలీల గురించి గురువులు నారాయణశాస్త్రి, సియ రామిత్ర ప్రసంగించారు.

ముగిసిన వీహెచ్‌పీ కార్యకర్తల సమావేశం



బాల్‌కొండప్పను సన్మానిస్తున్న నాయకులు

ఆదోని అర్బన్ : పట్టణంలో నిర్వహించిన విశ్వ హిందూ పరిషత్ రాష్ట్రస్థాయి కార్యకర్తల సమావేశం ఆదివారంతో ముగిసింది. రెండు రోజుల పాటు సాగిన సమావేశంలో హిందువుల సంప్రదాయం, ధర్మసందేశాలు, మనిషి యొక్క నడవడిక, ఉచ్ఛరించే భాష గురించి చర్చించారు. అనంతరం 45 సంవత్సరాల నుంచి సేవలు అందించిన బాల్‌కొండప్ప తదితర నాయకులను సత్కరించారు. సాయంత్రం హిందూధర్మ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బసవన్నగౌడ్, గౌరవాధ్యక్షులు హెగ్గటి ప్రతాప్, కార్యదర్శి నారాయణసింగ్, నాయకులు వర్మ, ఆంజనేయులు పాల్గొన్నారు.

వయోజనులకు క్విజ్ పోటీలు



క్విజ్ పోటీల్లో గెలుపొందిన వారిని అభినందిస్తున్న సొసైటీ నిర్వాహకులు

ఆదోని అర్బన్ : పట్టణంలోని శ్రీ మహాయోగి లక్ష్మమ్మ కో ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ రాయచోటి రామయ్య ఆధ్వర్యంలో భగవాన్ శ్రీ మహాయోగి లక్ష్మమ్మ సొసైటీ కేంద్రంలో ఆదివారం వయోజనులకు క్విజ్ పోటీలు జరిగాయి. ఈ పోటీలకు 40 మంది పాల్గొన్నారు. పర్యవేక్షకులుగా గట్టు మురళీకుమార్, నాగమణి, నరసయ్య, సంధానకర్తలుగా ఆర్‌ఎంజీ రెడ్డి, లక్ష్మీకాంత్, కృష్ణ, దీపికారెడ్డి, భీమరెడ్డి వ్యవహరించారు. పోటీల్లో ప్రథమ స్థానం లైబ్రేరియన్ సూర్యనారాయణ, రెండోస్థానంలో ఈశ్వర్, మూడో స్థానంలో రసూల్ నిలిచారు.

భక్తిశ్రద్ధలతో గురుపుష్యయోగ పూజలు



అలంకరణలో స్వామి వారు

ఆదోని అర్బన్ : పట్టణంలోని వారులోని మంగరాయ కాలనీలో వెలిసిన శ్రీ మంగరాయ ఆంజనేయ స్వామి సన్నిధిలో ఆదివారం గురుపుష్య యోగ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ మేనేజర్ రాఘవేంద్ర ఆధ్వర్యంలో స్వామికి తేనాభిషేకం, క్షీరాభిషేకం, ఫల పంచామృతాభిషేకం, తులసీ ప్రత్యేక పూల అలంకరణ, మహామంగళహారతి చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి గురురాజ ఆచారి గురుపుష్యయోగ పూజల గురించి వివరించారు. గురువులకు నమస్కరించుకునే రోజు అని, ఈ మేరకు మంగరాయ ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. అలాగే ఆలయంలో హోమాలు నిర్వహిచారు.

బీసీ హాస్టళ్లలో వసతులు కల్పించాలి

ఆదోని అర్బన్ : బీసీ వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు అధికారులు, నాయకులు చర్యలు చేపట్టాలని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మలేకర్ శ్రీనివాసులు, బీజేపీ జిల్లా కార్యదర్శి నాగరాజుగౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం స్థానిక బీసీ హాస్టల్‌ను సందర్శించారు. వారు మాట్లాడుతూ వసతి గృహాల్లో సమస్యలు తిష్ట వేశాయని, వాటిని పరిష్కరించడంలో వార్డెన్‌లు చొరవ చూపడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టల్ లోనే నివాసముండాల్సిన వార్డెన్‌లు, ఉండడం లేదని ఆరోపించారు. అద్దె భవనాల్లో నడుస్తున్న వసతిగృహాలకు వెంటనే సొంత భవనాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం పట్టణాధ్యక్షుడు మహాదేవ్, ఉపాధ్యక్షుడు దేవేంద్రకుమార్, నాయకులు రామకృష్ణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'కనకం'బరాలు

- సిరులు కురిపిస్తున్న పూలు
- రైతుల జీవితాల్లో వెలుగులు
- తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం



గవిగట్టు గ్రామంలో సాగు చేసిన కనకాంబరాల తోట

మంత్రాలయం : పంటల సాగులో పాత ధోరణికి స్వస్తి పలికి కొందరు రైతులు కొత్త పంథాను ఎంచుకున్నారు. పూల సాగుతో జీవితాల్లో వెలుగులు నింపుకుంటున్నారు. కనకాంబరాల విరులు సిరులు పండించుకుంటున్నారు. తక్కువ పెట్టుబడులతో అధిక లాభాలు పొందుతున్నారు.

80 ఎకరాల్లో సాగు

మంత్రాలయం నియోజకవర్గంలోని గవిగట్టు, పీకలబెట్ట, హాలికన్వి, గౌడగల్లు, జమ్ములదిన్నె, కంబదహాల్, తారాపురం, కోసిగి, దుద్ది, ఉరకుంద, మల్లనహట్టి గ్రామాలు, ఆదోని మండలం పెద్దతుంబళం, గోనెగండ్ల మండలం కేంద్రం ప్రాంత్రాల్లో ఎక్కువగా కనకాంబరాల తోటలు వేస్తున్నారు. గవిగట్టు, పెద్దతుంబళం, పీకలబెట్ట, గౌడగల్లు గ్రామాల్లో దాదాపు 80 ఎకరాల మేరా ఈ తోటలు సాగు చేశారు.

ఎకరాకు రూ.25 వేల వరకు ఖర్చు

మిరప సాగు తరహాలో ముందుగా బోదెలు ఏర్పాటు చేస్తారు. ఎకరాలో 16 వేల మొక్కల వరకు నాటుతారు. మూడు నెలల తర్వాత పూలు పూయడం మొదలవుతుంది. ఎకరా దుక్కి, నాటు, నారు, కూలీలు కోసం రూ.25వేల వరకు ఖర్చు వస్తుంది. మొదటి కోత వరకు కేవలం రెండు బస్తాల ఎరువు మాత్రమే వినియోగిస్తారు. తర్వాత రెండు బస్తాలు కాంప్లెక్స్ ఎరువులు వాడుకుంటూ పోతే 20 రోజుల వరకు పూలు పూస్తూనే ఉంటాయి. ఎకరా కోత కోయడానికి 10 మంది కూలీలు అవసరం. ఒక్కో కూలి రోజుకు 3 కేజీల వరకు పూలు కోస్తారు. రోజుకు ఒక్క కూలీకి రూ.200 వరకు చెల్లిస్తున్నారు. ఒక్కసారి నాటుకుంటే రెండేళ్ల వరకు పంట కాలం ఉంటుంది. పంట సంరక్షణ కోసం పెద్దగా పెట్టుబడులు అవసరం ఉండదని రైతులు పేర్కొన్నారు.

విరుల వెలుగులు

కనకాంబరాల విరుల సాగుతో రైతుల ఇళ్లలో వెలుగులు ప్రసరిస్తున్నాయి. మార్కెట్‌లో మంచి ధర పలుకుతుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో కేజీ కనకాంబరాలు రూ.400–450 వరకు ధర పలుకుతున్నాయి. రోజుకు 20 కేజీల వరకు అమ్ముకుంటే ఖర్చులు పోనూ రూ.5 వేలు మిగులుతోంది. పెళ్లిళ్ల సీజన్ వస్తే ధరలు మరింతగా పెరిగే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు.

ఇప్పటికే రూ.56 వేలు ఆదాయం



ఎకరా పొలంలో కనకాంబరాల తోట సాగు చేశా. నెల నుంచి పూలు పూస్తున్నాయి. ఇప్పటివరకు పంట కోసం రూ.20 వేలు ఖర్చు పెట్టా. ఇప్పటికే నాకు రూ.56 వేలు ఆదాయం వచ్చింది. నాలుగు నెలలకు గానూ కేవలం రెండు బస్తాల కాంప్లెక్స్ ఎరువు మాత్రమే వేశాను. కనకాంబరాలు సాగులో ఏనాడూ నష్టపోలేదు. ఏటా నేను ఈ తోట వేస్తున్నాను. మా ఊరిలో 50 ఎకరాల వరకు ఈ తోటలు పెట్టారు.

– కాశిం, గవిగట్టు

నిరుడు రూ.1.50 లక్షలు వచ్చాయి



నిరుడు ఎకరా పొలంలో కనకాంబరాలు వేశాను. పెట్టుబడులు పోనూ ఎకరాకు రూ.1.50 లక్షల ఆదాయం వచ్చింది. ఈ ఏడాది ఎకరాలో తోట పెట్టాను. పూలు బాగానే పూస్తున్నాయి. మార్కెట్‌లో మంచి ధర పోతుండటంతో ఆదాయం బాగానే ఉంది. మిరప పంటతో పోల్చుకుంటే కనకాంబరాల సాగే బాగుంది. ఇతర పంటలు వేసుకుని నష్టపోయే కంటే ఇలాంటి తోటలపై దృష్టి సారిస్తే బాగానే ఉంటుంది. – సలామ్, పెద్దతుంబళం

రాఘవేంద్రుడికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో మూలబృందావనం

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు భక్తులు దేశం నలుమూలల నుంచి ఆదివారం భారీగా తరలివచ్చారు. భక్తులు ముందుగా తుంగభద్ర నదిలో పుణ్యస్నానాలు ఆచరించి గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామి మూలబృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మఠం అధికారులు చర్యలు చేపట్టారు. భక్తులు భారీగా తరలిరావడంతో మఠం పరిసరా ప్రాంతాలు రద్దీగా మారాయి. పీఠాధిపతి శ్రీ సుభుధేంద్ర తీర్థుల ఆశీస్సులతో మూలబృందావనానికి వేకువ జాము నుంచి విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయులను చెక్క, వెండి, బంగారు రథాలపై ఊరేగించారు.

శ్రీ మఠానికి విరాళాలు

శ్రీ మఠంలో గోసంరక్షణ కోసం బెంగళూరుకు చెందిన సుదీంద్ర రూ. 3 లక్షలు, రాయచూర్‌కు చెందిన రాఘవేంద్ర వెండి రథానికి రూ.1,01,000 విరాళంగా అందజేశారు. వీరికి శ్రీ మఠం అధికారులు శేషవస్త్రం, స్వామి వారి మెమొంటో, ఫలమంత్రాక్షితలిచ్చి, పరిమళ ప్రసాదం అందజేశారు.

వాల్మీకి మహర్షి మందిరానికి ఎమ్మెల్యే విరాళం



కల్లుబావి వాల్మీకులకు విరాళం అందజేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని అర్బన్ : పట్టణంలోని కల్లుబావి వీధిలో నూతనంగా నిర్మిస్తున్న వాల్మీకి మహర్షి మందిరానికి ఆదివారం ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి రూ.లక్ష విరాళం అందించారు. కల్లుబావి వీధిలోని వాల్మీకులు, యువకులు, పెద్దలు ఎమ్మెల్యే స్వగృహానికి చేరుకుని వాల్మీకి మహర్షి ఆలయం ఏర్పాటుకు విరాళం అందించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే రూ.లక్షా వెయ్యి విరాళం అందజేశారు. వాల్మీకి పెద్దలు మాట్లాడుతూ రామాయణం రచించిన వాల్మీకి మహర్షి ఎంతో గొప్పవాడని, మహర్షి మందిరం నిర్మించేందుకు పెద్ద మనసుతో ఎమ్మెల్యే విరాళం అందించడం సంతోషించదగ్గ విషయమన్నారు.

హిందూ సంప్రదాయాలంటే విదేశీయులకు ఇష్టం



మాట్లాడుతున్న వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి

ఆదోని అర్బన్ : మన భారతదేశం సనాతన ధర్మంతో కూడినదని, హిందూ సాంప్రదాయాలను ప్రతి విదేశీయులు ఇష్టపడుతున్నారని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి, ఏపీ, తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జ్ శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి ఎమ్మిగనూరు రోడ్డులోని వాసవీ కళ్యాణ మండపంలో జిల్లా అధ్యక్షుడు బసవన్నగౌడ్ ఆధ్వర్యంలో హిందూ ఆత్మీయసమ్మేళనం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఇన్‌చార్జ్, రాష్ట్ర భజరంగదళ్ కన్వీనర్ ప్రతాపరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాకర్ల రాముడు పాల్గొని మాట్లాడారు. ముందుగా సీతారామలక్ష్మణ, ఆంజనేయస్వామి, భరతమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేశారు. వారు మాట్లాడుతూ హిందూ ధర్మం ఎంతో గొప్పదని, ప్రతిఒక్కరూ దీనిని పాటించాలన్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ గౌరవాధ్యక్షులు హెగ్గటి ప్రతాప్, కార్యదర్శి నారాయణసింగ్, భజరంగదళ్ జిల్లా కన్వీనర్ రవిశంకర్, నాయకులు కిరణ్‌వర్మ, ఆంజనేయులు, విట్టా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు పహారాలో నదిచాగి



నదిచాగిలో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

కౌతాళం: కౌతాళం పోలీస్‌స్టేషన్ పరిధిలోని నదిచాగి గ్రామం పోలీసు పహారాలో ఉంది. శనివారం రాత్రి గ్రామానికి చెందిన శివకుమార్‌గౌడ్ హత్యకు గురికావడం, నదిచాగి ఫ్యాక్షన్ గ్రామం కావడంతో 30 మంది పోలీసులతో బందోబస్తు చేపట్టారు. మృతదేహం గ్రామానికి చేరుకోవడంతో బీజేపీ జిల్లా నాయకులు రామస్వామి, కపిలేశ్వరయ్య, ఆదోని డివిజన్ ఇన్‌చార్జి పురుషోత్తంరెడ్డితో పాటు మండల నాయకులు నివాళులర్పించారు. శివకుమార్‌గౌడ్ హత్య కేసుకు సంబంధించి మృతుని భార్య సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఐదు గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన రామన్నగౌడ్ బస్సన్నగౌడ్, దేవన్న, రాముడు, ముది అలియాస్ రాములపై కేసు నమోదయ్యిందన్నారు. గ్రామంలో ఇద్దరు ఎస్‌ఐలు, 10 మంది పోలీసులతో పికెటింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిందితుల్ని పట్టుకునేందుకు ఆదోని డీఎస్పీ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో మూడు ప్రత్యేక బృందాలను నియమించినట్లు వెల్లడించారు.

రమణీయం.. నీలకంఠేశ్వరుడి రథోత్సవం



రథం వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఎమ్మిగనూరు/టౌన్/రూరల్: ఎమ్మిగనూరు ప్రజల ఆరాధ్య దైవం శ్రీ నీలకంఠేశ్వర స్వామి మహా రథోత్సవం లక్షలాది మంది భక్తజనుల జేజేలు మధ్య ఆదివారం సాయంత్రం 6.13 గంటల నుంచి 6.58 గంటల వరకు కనులపండువగా సాగింది. ముందుగా స్వామి వారి ఆలయంలో శ్రీ నీలకంఠుడికి విశిష్ట పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం స్వామివారి ఉత్సవ ప్రతిమను ఊరేగింపుగా తీసుకొచ్చి తేరుబజార్‌లో పీఠంపై ఆశీనులు చేసి హోమం నిర్వహించారు. పూర్ణకుంభంతో స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. చివరిగా స్వామి వారిని మహారథంపై ఆశీనులు చేసి రథోత్సవాన్ని శ్రీ మార్కండేయ స్వామి ఆలయం వరకు లాగి తిరిగి యథాస్థానానికి తీసుకొచ్చారు. స్వామివారిని మహారథంపై ఊరేగింపు నిర్వహించిన తీరు భక్తజనులను తన్మయానికి గురిచేసింది. రథోత్సవాన్ని తిలకించేందుకు దాదాపు 2 లక్షలపైగా భక్తులు తరలివచ్చినట్లు అంచనా. ఆదివారం ఉదయం స్వామి ఆలయంలో ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. రథోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా ఎస్పీ సిద్దార్థకౌశల్ నేతృత్వంలో ఆదోని డీఎస్పీ వినోద్‌కుమార్ పర్యవేక్షణలో పట్టణ, రూరల్ సీఐలు మధుసూదన్, మంజునాథ్ 400 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించారు.



హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

- ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి
- గౌడగల్లు గ్రామంలో ఇంటింటా కుళాయిల ప్రారంభం



కుళాయిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి

కోసిగి: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను తప్పకుండా నేరవేర్చి గ్రామాలను అభివృద్ధి చేయడమే తమ ధ్యేయమని ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి అన్నారు. ఆదివారం కోసిగి మండలం గౌడగల్లు గ్రామంలో జలజీవన్ మిషన్ కింద రూ.10.15 లక్షలతో చేపట్టిన ఇంటింటా కుళాయిలను వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి. మురళీ మోహన్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కోసిగి మండలంలోని 28 గ్రామాలకు జలజీవన్ మిషన్ కింద రూ.15కోట్లు మంజూరయ్యాయన్నారు. ఇందులో భాగంగా మొదటగా గౌడుగల్లు గ్రామంలో 155 ఇళ్లకు ఇంటికి ఒక కుళాయి చొప్పున ఏర్పాటు ప్రక్రియ పూర్తి చేయించినట్లు తెలిపారు. మండలంలోని అన్నీ గ్రామాల్లో ప్రతి ఇంటికీ కుళాయిలు కనెక్షన్ ఇచ్చి తీరుతామన్నారు. గౌడగల్లు గ్రామంలో గతంలో తాగునీళ్లు లేక ప్రజలు పోలాల వెంబడి తిరిగే వారని, వారి కష్టాలను గుర్తించి ఇంటింటా కుళీయిల ఏర్పాటు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు.

రైతు భరోసా కేంద్రం ప్రారంభం

మండల పరిధిలోని దుద్ది గ్రామంలో రూ.21.8 కోట్లతో కొత్తగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ప్రారంభించారు. ఏడీఏ ఎస్. గిరీష్, పంచాయతీ రాజ్ డీఈ అశ్వర్థామ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పూజలు చేసి ప్రారంభించారు. ముందుగా రైతు భరోసా కేంద్రం ప్రాంగణంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. రసాయనిక ఎరువులు వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులు వేయడం వల్ల నాణ్యమైన దిగుబడి సాధించవచ్చని చెప్పారు. ప్రభుత్వం గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల చెంతకే సేవలు అందిస్తోందని గుర్తు చేశారు. రైతులు రైతు భరోసా కేంద్రాల సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు నాడుగేని నరసింహులు, మండల కన్వీనర్ బెట్టన గౌడ, ఎంపీపీ ఈరన్న, ఆర్లబండ సహకార సంఘం అధ్యక్షుడు మహంతేష్ స్వామి, గౌడగల్లు సర్పంచ్ శివమ్మ, మాజీ మండల ఉపాధ్యక్షుడు హాజీ ఉస్మాన్, నాయకులు మాణిక్యరాజు, హొలగుంద కోసిగయ్య, వక్రాని వెంకటేశ్వర్లు, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదాలకు స్వస్తి




భూ హక్కు పత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

కోసిగి: వందేళ్లలో ఎన్నడూ లేని విధంగా రైతులకు, ప్రజలకు సంబంధించిన భూములను అత్యాధునిక పద్ధతులతో కొలతలు వేసి భూ వివాదాలకు స్వస్తి చెప్పి హక్కు పత్రాలు అందించడం చరిత్రాత్మక నిర్ణయమని ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని వందగల్లు గ్రామంలో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు– భూ రక్ష పథకంలో భాగంగా తహసీల్దార్ రుద్రగౌడ, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ మురళీ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో రైతులకు భూ హక్కు పత్రాల పంపీణీ కార్యక్రమం చేపట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బ్రిటీష్ కాలం నుంచి భూములకు సర్వే జరగలేదని, ప్రస్తుతం రీసర్వే ద్వారా సంబంధిత రైతులకు ఎంత భూమి ఉందో వివాదాలు లేకుండా భూ హక్కు పత్రాలు అందివ్వడం జరుగుతోందన్నారు. ఏళ్ల తరబడి భూ సమస్యలు పరిష్కారం కాక, వివాదాలకు తావునిస్తూ కోర్టు చుట్టూ తిరుగుతూ జీవితాలు నాశనం చేసుకున్న రైతులు ఉన్నారన్నారు. వారి సమస్యలకు శాశ్వత పరిష్కారం చేసే దిశగా సీఎం జగనన్న భూ హక్కు– భూ రక్ష పథకం శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం వందగల్లు గ్రామంలో 3,800 ఎకరాలకు భూములను సర్వే చేసి 915 మంది రైతులకు భూ హక్కు పత్రాలు అందించినట్లు తెలిపారు. మండలంలోని కలువలగుండు, పుట్టకుంట, యండపల్లి, పల్లెపాడు, పెండేకల్లు, పోలాలను రీసర్వే పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. రైతులు అధికారులకు సహకరించి రీసర్వే చేసుకుని భవిష్యత్ భూ సమస్యలను రాకుండా పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొవంజమ్మ, కాల్వ లక్ష్మయ్య, ఎంపీపీ ఈరన్న, మండల నాయకులు నాడుగేని నరసింహులు, మండల కన్వీనర్ బెట్టన గౌడ, వెంకట రెడ్డి, నేలకోసిగి లక్ష్మన్న, మంగమ్మ, మాణిక్యరాజు తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఆదోని రూరల్ : ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం 2023 సంవత్సరం నూతన క్యాలెండర్‌ను ఆదోని డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో రజక సంఘం జిల్లా అధ్యక్షుడు సి.ముక్కన్న మాట్లాడుతూ రాష్ట్రంలో జీఓ నంబర్ 27 ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న ధోబీ పోస్టులు, దేవాలయాలు, పోలీసుశాఖ, ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టులను రజకులకే కేటాయించాలని కోరారు. 50 ఏళ్లు నిండిన వారికి పింఛన్ సదుపాయాన్ని కల్పించాలన్నారు. జగనన్న చేదుడు షాపులు ఉన్న వారికి మాత్రమే ఇస్తున్నారని, అలా గాకుండా ఇంటి వద్ద చాలామంది రజక వృత్తి చేస్తున్నారని, వారికి కూడా రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేయాలని కోరారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు రామన్న, ఉరుకుందు, ఈరన్న, నాగరాజు, చిదానంద, పట్టణ నాయకులు నాగప్ప, మల్లప్ప, మల్లయ్య, ప్రకాష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సిమెంటు రోడ్డు నిర్మాణం



సిమెంటు రోడ్డు వేస్తున్న దృశ్యం

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలోని 11వార్డులోని పింజరి వీధిలో సిమెంటు రోడ్డు నిర్మాణానికి ఆదివారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పాల్‌దినకర్ మాట్లాడుతూ.. గ్రామంలో అన్ని వీధుల్లో సిమెంటు రోడ్డు వేస్తామన్నారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సహకారంతో గ్రామంలోని పింజరి వీధిలో సిమెంటు రోడ్డు పనులు ప్రారంభించామన్నారు. గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్న పంచాయతీ దృష్టికి తీసుకుని వస్తే పరిష్కారిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ తిక్కయ్య, వైఎస్ ఎంపీపీ బుజ్జిస్వామి, మాజీ ఎంపీటీసీ చౌదరిబసవ, మాజీ సర్పంచ్ అవతారం, జెడ్పీ ఉన్నత పాఠశాల చైర్మన్ వడ్డేరాము, భూపాల్ ఉన్నారు.

సౌత్‌జోన్ పోటీలకు వందగల్లు క్రీడాకారుడు



రాము

కోసిగి: మండల పరిధిలోని వందగల్లు గ్రామానికి చెందిన చాకలి హనుమంతమ్మ, భీమన్న దంపతుల కుమారుడు రాము సౌత్‌జోన్ ఖోఖో పోటీలకు ఎంపికయ్యాడు. ఇతను ఎమ్మిగనూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. గతేడాది డిసెంబర్ 28, 29వ తేదీలలో కర్నూలు సిల్వర్ జుబ్లీ కళాశాలలో జరిగిన రాయలసీమ యూనివర్సిటీ ఖోఖో పోటీలలో పాల్గొని ప్రతిభ చూపాడు. దీంతో ఈనెల 9 నుంచి కాకినాడలో జరిగే సౌత్‌జోన్ నేషనల్ ఖోఖో పోటీల కోసం రాయలసీమ జట్టుకు ఎంపిక చేశారు.

గుడిసెకు నిప్పంటించిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఆదోని రూరల్ : కురివాసప్ప గుడిసెకు నిప్పంటించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం పార్టీ మండల నాయకులు తిక్కప్ప పోలీసు అధికారులను కోరారు. బాధిత కుటుంబాన్ని ఆదివారం ఆయన పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో రాత్రి సమయంలో కొందరు వ్యక్తులు కురివాసప్పకు చెందిన కొట్టానికి గత శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారన్నారు. అదృష్ట వశాత్తు ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణాపాయం జరగలేదన్నారు. రెండు క్వింటాళ్లకు పైగా బియ్యం, బట్టలు కాలిపోయాయన్నారు. అధికారులు స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందించి కొత్త ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఆదోని అర్బన్ : ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ నరసింహులు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సిఫారసు బదిలీలను ఆపి, పారదర్శకంగా బదిలీలను చేపట్టాలన్నారు. మెడికల్ బిల్లులను త్వరితగతిన పూర్తి చేయాలని, 2022 పదోన్నతుల వారికి మ్యాన్యువల్ లేదా ఆన్‌లైన్ కౌన్సెలింగ్ జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సుంకన్న, రామప్ప, బసవరాజ్, ఈరప్ప, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో నీటి వసతి



బోరు నుంచి నీటిని విడుదల చేస్తున్న వైఎస్సార్ సీపీ మండల నాయకులు

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని జగనన్న కాలనీలో చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ మురళీ మోహన్ రెడ్డి సహకారంతో నీటి వసతి ఏర్పాటు చేసినట్లు కోసిగి మండల వైఎస్సార్ సీపీ నాయకులు మాణిక్యరాజు, వక్రాని వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం జగనన్న కాలనీలో కొత్తగా వేసిన బోరుకు మోటార్ అమర్చి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మల్లికార్జున రెడ్డి ఆధ్వర్యంలో నీటి సరఫరా ప్రారంభించారు. వారు మాట్లాడుతూ కాలనీల్లో దాదాపు 550 ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతున్నట్లు తెలిపారు. కాలనీలో పలు చోట్ల ట్యాంక్‌లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బోరు నుంచి ట్యాంక్‌లకు నీటిని సరఫరా చేసి అక్కడ నుంచి ఇళ్ల నిర్మాణాలకు ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో దొడ్డి భీమయ్య, రాజేష్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.